
నార్సింగిలో ప్రజాపాలనను ప్రారంభించిన అశోక్‌యాదవ్, కౌన్సిలర్లు


దరఖాస్తును పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ డీసీ రవికుమార్


పరిశీలిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

‘ప్రజాపాలన’ ప్రారంభం

మణికొండ: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రజలంత పథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ. ప్రకాష్‌గౌడ్, మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి, నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, వైస్ చైర్మెన్‌ను కె. నరేందర్‌రెడ్డి, జి.వెంకటేష్‌యాదవ్‌లు అన్నారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల పరిధిలోని 38 వార్డులలో ప్రజాపాలనలో భాగంగా పలు పథకాలకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు అందుకునే కార్యక్రమాన్ని వారితో పాటు కౌన్సిలర్‌లు వారి వార్డులలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను ఇవ్వటం ప్రభుత్వ విధి అన్ని వాటిని ప్రతి ఒక్కరికి చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. గతంలో అనేక పథకాల ద్వార లబ్ధి పొందిన వారు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించిందన్నారు. రాబోయే రోజుల్లో సమగ్ర సర్వే జరిపి నిజమైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌లు కె. ఫల్గుణ్ కుమార్, బి.సురేందర్‌రెడ్డి, మేనేజర్‌లు రమేష్, యోగేష్‌లతో పాటు కౌన్సిలర్‌లు, అధికారులు, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభయ హస్తం, ప్రజాపాలనలో ప్రజల నుంచి స్వీకరిస్తున్న దరఖాస్తు ఫారాలను ప్రతి నిరుపేదకు అందేలా చూడాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ కస్తూరి నరెందర్ అధికారులను కోరారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో ప్రజాపాలన దరఖాస్తూ స్వీకరణలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను నేరవేస్తున్నదని ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. అలాగే మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించారు. రాజేంద్రనగర్ ఉపకమిషనర్ రవికుమార్ ప్రజాపాలన దరఖాస్తుల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని కోరారు. ఈ దరఖాస్తులు జనవరి 6వ తేదీ వరకు స్వీకరించబడుతాయని ప్రజలకు తెలిపారు. రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాళ్, మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి. మధులు డివిజన్‌లోని అన్ని వార్డు కార్యాలయాలలో పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.


కోకాపేటలో దరఖాస్తులు అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: అభయ హస్తం ఆర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ చూడాలని జిల్లా కలెక్టర్ ప్రీతమ్ పాట్రు అధికారులకు సూచించారు. మండలంలోని నర్కూడలో గురువారం నిర్వహించిన ‘ప్రజా పాలన’ కార్యక్రమాన్ని సందర్శించారు. కార్యక్రమం తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆర్జీదారుల నుంచి తీసుకున్న దరఖాస్తులకు రశీదులు అందజేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. పెద్దషాపూర్, పాల్మాకుల, కవ్వగూడ, జూకల్, పెద్దషాపూర్ తాండలో ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. గ్రామాల్లో మొదటగా.. దరఖాస్తు ఫారాలను పంపిణీ చేపట్టగా.. గంట వ్యవధిలోనే ఫారాలు అయిపోయాయి. స్థానికులకు ముందుగా ఫారాలు పంపిణీ చేసి.. కౌంటర్ల ద్వారా వాటిని స్వీకరించి రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మల్లయ్య, తహసీల్దార్ నాగమణి, ఎంపీడీఓ వసంతలక్ష్మీ, ఎంపీఓ ఉషాకిరణ్, ఎంపీటీసీ సభ్యులు చెక్కల ఎల్లయ్య, గౌతమి, సర్పంచు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అభయ హస్తం కార్యక్రమంలో గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అట్టహాసంగా ప్రారంభమైంది. కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్దకు ప్రజలు ఉదయం నుంచే చేరుకొని దరఖాస్తులను స్వీకరించారు. కొన్ని కేంద్రాల వద్ద దరఖాస్తు ఫారాలు పూర్తి కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ప్రజలు మీసేవా, ఇంటర్నేట్, జిరాక్స్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు ఫారాలను తెచ్చుకున్నారు. కొన్ని షాపుల నిర్వహకులు అధిక రేట్లకు దరఖాస్తులను అమ్ముకున్నారు.


మణికొండ చిత్రపురిలో ప్రజాపాలను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్ తదితరులు

కమిషనర్ సందర్శన...

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని గురువారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సందేశాన్ని ప్రజలకు చదివి వినిపించారు. అప్లికేషన్ ఫారంలో రాయవలసిన వివరాల గురించి క్లుప్తంగా ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఎం.సంతోషికుమారి, మేనేజర్ వి. వేణుగోపాల్‌రెడ్డి, ఏఈఈ వి. రాజ్‌కుమార్, ఆర్ఐ బి. జగన్‌మోహన్ తదితరులున్నారు.

ప్రజాపాలనను సద్వినియోగం చేసుకోవాలి...

ప్రజలంతా ప్రజా పాలన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోని ఆరు గ్యారెంటీ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ పిఅండ్‌టి కాలనీలో ఆలంఘర్ మసీద్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రజలకు నూతన రేషన్ కార్డుల కోసం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి తదితర పథకాల కోసం ఫామ్‌లను అందించి వారి దరఖాస్తులు స్వీకరించారు.

● ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఇస్తున్న గ్యారెంటీ పథకాల కోసం సమాన్య నిరుపేద ప్రజలు ఏ ఒక్కరికి తలొగ్గకుండా నేరుగా ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజాసేవలో భాగస్వాములమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ జాగీరు మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ, నవీన్‌కుమార్, గణేష్, ప్రేమ్‌కుమార్, షేక్ మక్బూల్, శివ, ఆశవర్కర్‌లు, పాల్గొన్నారు.


ప్రజాపాలన కార్యక్రమంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్ పాట్రు


మండలంలోని పెద్దషాపూర్‌లో దరఖాస్తులు తీసుకుంటున్న ఎంపీఓ ఉషాకిరణ్


ప్రజలకు ఉచిత మందులను అందజేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది


ప్రజాపాలన కేంద్రాలను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాళ్


బండ్లగూడలో ప్రజలకు ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపిస్తున్న కమిషనర్ బి. శరత్‌చంద్ర


పిఅండ్‌టి కాలనీలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ పద్మావతిపాపయ్యయాదవ్


బండ్లగూడలో ప్రజా పాలన కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణారెడ్డి తదితరులు

దరఖాస్తుల వెల్లువ

మణికొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రజాపాలనలో సంక్షేమ పథకాలకు దరఖాస్తుల వెల్లువ వచ్చింది. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులలో 2278 మంది తమకు పథకాలు కావాలని దరఖాస్తులు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో ప్రభుత్వం ప్రకటించిన ఐదు సంక్షేమ పథకాలకు 677 దరఖాస్తులు రాగా ఇతర అవసరాలకు 342తో కలపి మొత్తం 1019 వచ్చాయి. గురువారం ఉదయం 8గంటల నుంచే అన్ని వార్డులలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. దరఖాస్తులు అందజేసేందుకు వచ్చే ప్రజలకు తాగు నీరు, టెంట్‌లను ఏర్పాటు చేయటంతో పాటు ఆరోగ్య సమస్యలు ఎదురయితే ముందు జాగ్రత్త చర్యగా వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మున్సిపల్ కమిషనర్‌లు బి. సురేందర్‌రెడ్డి, కె. ఫల్గుణ్‌కుమార్, మేనేజర్‌లు యోగేష్, రమేష్‌లు దరఖాస్తు కేంద్రాల అధికారులు, ధరఖాస్తు దారులకు అనుమానాలను నివృత్తి చేశారు.

మొదటి రోజు 8259 దరఖాస్తుల స్వీకరణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలోని 8,259 దరఖాస్తులను స్వీకరించినట్లు ఉప కమిషనర్ రవి కుమార్ తెలిపారు. ఆరు హామీల పథకాల కోసం 6203 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అలాగే రేషన్ కార్డుతో పాటు ఇతర వాటి కోసం 2056 దరఖాస్తుల అందినట్లు వెల్లడించారు. మొదటిరోజు కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకున్నామని తెలిపారు. అలాగే పూర్తి చేసిన దరఖాస్తులను తీసుకునేందుకు ప్రత్యేకంగా కౌంటర్‌లు ఏర్పాటు చేసి స్వీకరిస్తున్నామన్నారు.

డ్రోన్ నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం

శంషాబాద్ రూరల్: మండలంలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం డ్రోన్ నైపుణ్య శిక్షణపై అవగాహన ఒప్పందం చేసుకున్నారు. కళాశాల, ఇండియన్ డ్రోన్ అకాడమి పరస్పర సాంకేతిక, నైపుణ్య శిక్షణపై ఈ ఒప్పందం జరిగిందని ప్రిన్సిపల్ డాక్టర్ జేవీఆర్ రవీంద్ర తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానంపై అధ్యాపకులు, విద్యార్థులకు ఈ అకాడమి నిపుణులతో నైపుణ్య అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు అకాడమి డైరెక్టర్ డి. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసెర్చ్, డెవలప్‌మెంట్ డీన్ జె. కృష్ణ చైతన్య, సీఎస్ఎం విభాగాధిపతి ఎం.ఎ. జబ్బార్ పాల్గొన్నారు.


ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఇండియన్ డ్రోన్ అకాడమి ప్రతినిధులు

సొసైటీ సర్వసభ్య సమావేశం


కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ దౌనాకర్‌గౌడ్

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ సొసైటీ సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. సొసైటీ చైర్మన్ బి. దౌనాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర కేలెండర్‌ను ఆవిష్కరించారు. రైతులకు రూ.60 లక్షల దీర్ఘకాలిక రుణాలకు ఈ సమావేశంలో అనుమతులు తీసుకున్నారు. 28 మంది రైతులకు సొసైటీలో కొత్తగా సభ్యత్వం కల్పించారు. సన్న, చిన్నకారు రైతులకు రూ.5,35,000 రుణాలను పంపిణీ చేశారు. సొసైటీలో బంగారు రుణాలపై గ్రాముకు రూ.4,100 ఇవ్వాలని తీర్మాణం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, విజయలక్ష్మీ, బాల్యానాయక్, జనార్ధన్, సీఈఓ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాయి మందిరంలో అన్నదానం

శంషాబాద్: ధర్మసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా పల్లకి సేవ, హారతి కార్యక్రమాలతో పాటు ప్రత్యేక హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున బాబాను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండంలో వందలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమాలను ఆలయ ట్రస్టీ శివదత్తసాయి పర్యవేక్షించారు.



కనుల పండువగా అయ్యప్ప పడిపూజ


పూజల్లో పాల్గొన్న అయ్యప్ప స్వాములు, భక్తులు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని శివాంజనేయ స్వామి దేవాలయంలో పిట్టల లక్ష్మణ్ గురుస్వామి ఆధ్వర్యంలో 18వ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములతో పాటు స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులయ్యారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కస్తూరి నరేందర్ ముదిరాజ్, పిట్టల శివ ముదిరాజ్, అశోక్ ముదిరాజ్, సాయి కుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బీపీఎస్‌సీలో ‘మనూ’ విద్యార్థుల ప్రతిభ

రాయదుర్గం: బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(బీపీఎస్‌సీ) టీచర్ రిక్రూట్‌మెంట్ ఎగ్జామ్ (టీఆర్‌ఈ)లో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విద్యార్థులు సత్తా చాటారని స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు. ఒకేసారి ఈ విభాగానికి చెందిన 180 మందికిపైగా విద్యార్థులు పీహెచ్‌డీ, ఉర్దూ, గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, లాంగ్వేజెస్ వంటి సబ్జెక్టులలో టీచింగ్ పోస్టులకు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. సీనియర్ సెకండరీలో ఉర్దూ సబ్జెక్టుకు మహ్మద్ షాహిద్‌రజా ప్రథమస్థానం సాధించారన్నారు. టీచింగ్ ఫ్యాకల్టీ విద్యార్థులను అభినందించారు.

ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు

మైలార్‌దేవ్‌పల్లి: కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన ఆరు గ్యారంటీల పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు కుమారి అబ్బెసి సదాలక్ష్మి అన్నారు. గురువారం పల్లెచెరువు ప్రాంతంలో కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కాంగ్రెస్ జెండాను ఎగురువేసి జై కాంగ్రెస్ అంటు నినాదాలు చేశారు. గగన్ పహాడ్ ప్రాంతంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జెండా ఎగురువేసి ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హమీలను తూచా తప్పకుండా నేరవేరుస్తారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయి రెడ్డి, వెంకటేష్, లక్ష్మణ్, గండయ్య, శ్రీశైలం, బోల్ల వెంకటేష్ తదతరులు పాల్గొన్నారు.

శంషాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని కాచారం, మల్కారం గ్రామాల్లో గురువారం పార్టీ జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి సాధిస్తుందని మాజీ సర్పంచులు సిద్దేశ్వర్, జగన్నాథం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మణికొండ: దేశ స్వాతంత్ర పోరాటంతో పాటు పరిపాలనలో ప్రజా సంక్షేమాన్ని, దేశాభివృద్ధిని ఆకాంక్షించిన పార్టీ కాంగ్రెస్ అని ఆ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి, మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె. నరేందర్‌ముదిరాజ్ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ 139వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ చౌరస్తాలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందన్నారు. ప్రాంతీయ పార్టీల కన్నా దేశాభివృద్ధికి జాతీయ పార్టీలే కృషి చేస్తాయని రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లోను అత్యధిక ఎంపీ సీట్లను గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మున్సిపాలిటి అధ్యక్షుడు ఎం. జితేందర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కౌన్సిలర్‌లు పురుషోత్తం, పద్మారావు, నాయకులు వి.నరేష్, బి.ముత్యాలు, కె.సతీష్, బి.ఇందిర, కె.యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.


పుప్పాలగూడలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించిన నరేందర్‌ముదిరాజ్


జెండాను ఆవిష్కరిస్తున్న సదాలక్ష్మి


కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నాయకులు


ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న పార్టీ నాయకులు

దివ్యాంగులకు అండగా ఉంటా

గోల్కొండ: దివ్యాంగులు, వృద్ధులకు అండగా ఉండి ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చూస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నానల్‌నగర్ డివిజన్‌లోని ప్రజాపాలన కేంద్రం వద్ద వీల్‌చైర్‌పై ఉన్న ఓ మహిళను కలుసుకొని ఆమె సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఆసరా పింఛన్ లభించిందన్నారు. అయితే ఇప్పటి వరకు ఆసరా పింఛన్ పొందుతున్న వారు కొత్త పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే దివ్యాంగులు తమ సదరం నెంబర్‌ను దరఖాస్తు ఫారంలో తప్పకుండా రాయాలని ఆయన సూచించారు.


వీల్ చైర్‌పై ఉన్న ఓ మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

రమణీయం కూచిపూడి రంగప్రవేశం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య కళా సంస్థ అభినయ కూచిపూడి కళాక్షేత్రం ఆధ్వర్యంలో నృత్య గురువు పావని శ్రీలత ప్రసాద్ శిష్యురాలు శ్రేయ పన్నాల కూచిపూడి రంగ ప్రవేశం గురువారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. గణేశ స్తుతి, శబదం, దరువు, అన్నమాచార్య కీర్తన, బాల సరస మురళి, థిల్లాన వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం సినీ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ..ఉన్నత విద్యను అభ్యసించి శాస్త్రీయ సంగీత కళలలో రాణించడం ఎంతో ప్రశంసనీయమన్నారు. ప్రముఖ నృత్య కళాకారిని సౌజన్య శ్రీనివాస్, ప్రముఖ వక్త నండూరి శ్రీనివాస్, చరిత్రకారులు ముదిగొండ శివప్రసాద్, ప్రొఫెసర్ జొన్నలగడ్డ అనురాధ, తెలుగు విశ్వవిద్యాలయం నృత్యశాఖ హెచ్‌ఓడీ వనజ ఉదయ్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖల ద్వారా గుర్తింపు పొందిన రిక్రూట్మెంట్ ఏజెన్సీ జపాన్ ప్రభుత్వ పథకం–స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్స్(ఎస్ఎస్‌డబ్ల్యూ) కింద జపాన్‌లో పనిచేసేందుకు అర్హత కలిగిన హోటల్ మేనేజ్‌మెంట్ సిబ్బందికి శిక్షణ, నియామకం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టామ్‌కామ్ సీఈఓ ఓ ప్రకటనలో తెలిపారు. జపాన్ హోటల్ మేనేజ్‌మెంట్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను గుర్తించడానికి టామ్‌కామ్ డిసెంబరు 29, 30వ తేదీల్లో మల్లేపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని టామ్‌కామ్ కార్యాలయంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

ఈ ఉద్యోగాలకు అర్హత సాధించడానికి అభ్యర్థులు తప్పనిసరిగా హోటల్ మేనేజ్‌మెంట్ డిప్లొమా లేదా డిగ్రీని కలిగి ఉండాలని తెలిపారు. హోటల్ పరిశ్రమలో అనుభవం కలిగి ఉండాలని తెలిపారు. అభ్యర్థులు 22 నుంచి 27 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు అర్హులని తెలిపారు. జపనీస్ భాషపై రెసిడెన్షియల్ శిక్షణ, జపాన్‌లో పనిచేయడానికి అవసరమైన అదనపు వృత్తిపరమైన నైపుణ్యాలు ఎంపిక చేయబడిన అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పించబడుతాయని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు 29, 30వ తేదీల్లో జరిగే స్పెషల్ డ్రైవ్‌ను హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు 78935 66493, 98496 39539 లలో సంప్రదించాలని కోరారు.